
విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రీబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
ఆదివారం 8 మార్చి 2026

# రథోత్సవ సందర్భంగా పటిష్టమైన భద్రత...

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ






శ్రీ సత్య సాయి జిల్లా, మార్చి 7 (అనంత ప్రభ)

కదిరి పట్టణంలో జరగనున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 10న నిర్వహించనున్న రథోత్సవానికి సంబంధించి భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ గారు శనివారం స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా దేవాలయ పరిసర ప్రాంతాలు, రథం ప్రయాణించే మార్గం, ప్రధాన కూడళ్లను జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారు సందర్శించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ గారు, డిఎస్పి శివ నారాయణ స్వామి గారు, ఆలయ ప్రధాన అర్చకులు, అధికారులతో కలిసి రథోత్సవానికి ఏర్పాట్లపై సమీక్షించారు.

ఈ రథోత్సవ కార్యక్రమానికి ఆంధ్రతో పాటు, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు.

రథోత్సవం జరిగే మార్గమంతా ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జన సందోహాన్ని నియంత్రించడంతో పాటు, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రథం తిరిగే ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తాగునీటితో పాటు, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.

అదేవిధంగా దేవాలయ ప్రాంతంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా భద్రతను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు సురక్షితంగా దర్శనం చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

భక్తులు కూడా పోలీసులకు సహకరించి నియమ నిబంధనలు పాటిస్తూ రథోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ గారు కోరారు.

అనంతరం కదిరి టౌన్ మహిళా పోలీస్ స్టేషన్ ని తనిఖీ చేసి మహిళా భద్రతపై పలు సూచనలు చేశారు.

ఈ పరిశీలనలో జిల్లా ఎస్పీ గారితో పాటు, డి.ఎస్.పి శివ నారాయణ స్వామి , ఆలయ ఈవో శ్రీనివాస రెడ్డి, సిఐలు డివి నారాయణ రెడ్డి, నిరంజన్ రెడ్డి, నాగేంద్ర సంబంధిత పోలీస్ అధికారులు మరియు దేవాలయ అధికారులు పాల్గొన్నారు.

# అగ్ర కులలాలు దళితులపైన దాడి



అనంతపురం, మార్చి 7 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా కూడేరు మండలము కలగళ్ల గ్రామ నివాసి అయినా సింగంపల్లి మాదిగ ధనుంజయ ం/శీ మాదిగ ఓబన్న అను నన్ను నిన్నటి దినము అనగా 06-03-2026 తేదీ నాడు మా గ్రామ నివాసులైన కురుబ ప్రభాకర్

కురుబ అనిల్, కురుబ లక్ష్మీదేవి, కురుబ వంశీ, కురుబ గోపాల్, ఈడిగ ఎర్రిస్వామి, అను వారు నన్ను కులం పేరుతో దుసిస్తూ చేతికి అందిన వస్తువులతో నా పైనా దాడిచేసి కొట్టారు. ఐతే నేను వ్యవసాయ పనులను నిమిత్తమై ఈతాకు కోసుకుని ఉంటిని. ఇదే ఈతాకునే పైనా కానపారిచిన అగ్రవర్ణ కులస్థులు ధర్జన్యంగా మా ఈతాకును అమ్ముకున్నారు. ఐతే అమ్ముకున్న విషయం పైనా మాదిగ ధనుంజయ అను నేను అమ్ముకున్న వారి ఇంటిదగ్గర వెళ్లి మర్యాదపూర్వకంగా ఎందుకు నా ఈతాకును అమ్ముకున్నారు అని అడగగా మాదిగ ధనుంజయ అను నన్ను పైవారు ఏరా మాదిగ లంజకొడకా నీవు మా ఇంటికి వచ్చి మమ్మల్ని ఆడీగెంతా మగోడివా అమ్ముకున్నది నిజమే నీ ఇష్టం వచ్చిన చోట చొప్పకోపో అని ముకుమ్మిడిగా చేతికి అందిన వస్తువులుతో నాపైనా దాడి చేసి కొట్టారు. అప్పుడు నా అన్న అయినా సింగంపల్లి గోవిందు వచ్చి నా తమ్ముడిని చంపుతున్నారు అని చూడగా అప్పటికే సృహతప్పి పడిపోయిన ధనుంజయను హాస్పిటల్ కి తీసుకొని వస్తూ ఉండగా గ్రామ శివర్లో ప్రభాకర్ అనే వ్యక్తి బైకులో వచ్చి అడ్డగించి మరణాయుధం అయినా కొడవలితో ఏరా మాదిగ అంటూ నానా బూతులు తిట్టుతు నామీద కేసు పెట్టడానికి వెళ్తున్నారా మీరు నామీద కేసు పెడితే మిమ్మల్ని హతమారుస్తా అని భయపెట్టాడు, అప్పుడు మేము ప్రభాకర్ నుండి తప్పించుకొని అనంతపురం గవర్నమెంట్ హాస్పిటలో ధనుంజయను అడ్మిట్ చేసాము. ఐతే ఈ అన్యాయాక్రమాలపైన పైవారి మీద పోలీస్ వారు జిల్లా ఎస్. పి. జగదీష్ గుంతకల్లు డి. ఎస్. పి. శ్రీనివాస్ కూడేరు సి. ఐ వెంటనే దళితుల పైన దాడి చేసినవారి పైనా తగు చెర్యలు తీసుకొని వారి పైనా ఎస్. సి ఽఎస్. టీ అట్రాసిటీ కేసు నమోద చేసి మాకు న్యాయం చేయవలసినదిగా కోరుతున్నాము.

# మహిళలను అన్ని రంగాలలో రాణించాలి : జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు







అనంత, మార్చి 7 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా కోర్టు ఆవరణలో గల న్యాయవాదుల భవన మందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అనంతపురం వారి ఆధ్వర్యంలో శనివారం రోజున నిర్వహించిన మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా జడ్జి ఈ. భీమారావు మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాలలో సమాన ప్రోత్సహించడం మన బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలో మహిళలకు సమాన వాటా ఇవ్వడం అనేది బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నారని ఇంకా మనం వారికి అవకాశాలు పొందుపరచాలని దాని ద్వారా వారు వారి సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి అవకాశం కల్పించినట్టు ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు ప్రాధాన్యతను ఇవ్వడం చట్ట చట్ట బాధ్యత కాదని సమాజం సంపూర్ణంగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మొదటి అదనపు జిల్లా జడ్జి సి. సత్యవాణి,ఫ్యామిలీ కోర్టు జడ్జి హరిత, బారసోసియేషన్ అధ్యక్షులు గురు ప్రసాద్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి తదితర అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ షెడ్యూలు న్యాయవాదులు, పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో మహిళా జిల్లా జడ్జిలకు న్యాయవాదులకు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులతో పాటు జిల్లా కోర్టులో పనిచేసే మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# సాయి ఆరామంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు..

## మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ



పుట్టపర్తి , మార్చి 7 (అనంత ప్రభ)

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పుట్టపర్తి సమీపంలోని సాయి ఆరామంలో శ్రీ సత్య సాయి జిల్లా మహిళా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి

శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ గారు వారి సతీమణి ధరణ్య గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలందరికీ ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ..

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో విశిష్టమైందన్నారు

కుటుంబ వ్యవస్థను నిలబెట్టే శక్తి మహిళలదేనన్నారు.

అడిషనల్ ఎస్పీ శ్రీమతి అంకిత సురాన ఐపీఎస్ గారు గారు మాట్లాడుతూ...

మహిళల ప్రాముఖ్యత, కుటుంబం మరియు సమాజ అభివృద్ధిలో మహిళల యొక్క ముఖ్య పాత్ర గురించి తెలియజేశారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరుస్తూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

కార్యక్రమం ముగింపు సందర్భంగా మహిళా పోలీస్ సిబ్బంది ఆట పాటలతో అందరినీ అలరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారి తో పాటు వారి సతీమణి ధరణ్య గారు, అడిషనల్ ఎస్పీ శ్రీమతి అంకిత సురాన ఐపీఎస్ గారు, మహిళా సీఐలు, ఎస్ఐలు, మహిళా కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్‌స్టేషన్లలో జరుగుతున్న పనులను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేయాలి

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



శింగనమల, మార్చి 7 (అనంత ప్రభ)

సింగనమల మండలంలోని పెరవలి వద్ద పీఎం కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేస్తున్న సౌర విద్యుత్ ప్రాజెక్ట్ పరిశీలన.. నాయనపల్లి క్రాస్ వద్ద పీఎం సూర్య ఘర్ పథకం లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్.

జిల్లాలోని 20 సబ్‌స్టేషన్లలో జరుగుతున్న పనులను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సింగనమల పరిధిలోని పెరవలి గ్రామంలో పీఎం కుసుమ్ పథకం కింద ఏర్పాటు చేస్తున్న 4 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మరియు మెఘా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో సమావేశమై జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సౌర విద్యుత్ ప్రాజెక్ట్ పనులు వేగంగా చేపట్టాలని, జిల్లాలోని 20 సబ్‌స్టేషన్లలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.

అనంతరం నాయనపల్లి క్రాస్ వద్ద పీఎం సూర్య ఘర్ పథకం కింద లబ్ధిదారుల ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ పథకం ద్వారా వినియోగదారులకు మరియు ప్రభుత్వానికి కలిగే ప్రయోజనాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని మరియు మరింత మందిని ఈ పథకానికి ప్రోత్సహించాలని లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శేషాద్రి శేఖర్, ఈ జె.వి.రమేష్, డీఈ రఘు, తదితరులు టిడిపి నాయకులు మండల కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడుపాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్ లపై మరింత నిఘా పెంచాలి : డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఈ బీ దేవి




అనంతపురం, మార్చి 7 (అనంత ప్రభ)

జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా మరింత పటిష్టమైన నిఘా పెంచాలని పి సి పి ఎన్ డి టి చట్టం అమలు సలహా కమిటీ తీర్మానించింది.

శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంహెచ్వో డాక్టర్ ఈ .బి. దేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం-అనంతపురం జిల్లాలో అమలు అనే అంశంపై సమీక్ష జరిగింది. జిల్లాలో 188 స్కానింగ్ సెంటర్లు పనిచేస్తున్నాయని , వీటిని వైద్య ఆరోగ్య బృందాలు తరచూ తనిఖీలు చేసి లింగ నిర్ధారణ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సమావేశం కోరింది. జిల్లాలో మరో 9 స్కానింగ్ సెంటర్లు కొత్తవి ప్రారంభించేందుకు, 12 కు రెన్యువల్ అనుమతి ఇచ్చేందుకు, మరో 20 స్కానింగ్ సెంటర్ల లో సిబ్బంది, యంత్రాల మార్పులకు సమావేశం ఆమోదం తెలిపింది. బాల్య వివాహాలు, టీనేజ్ గర్భాలు జరగకుండా మహిళా శిశు సంక్షేమ శాఖ ,వైద్యశాఖ, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషిచేసి వాటి తగ్గింపులో ముందుండాలని కోరారు.

ఈ సమావేశంలో ఆర్డిటి హెల్త్ డైరెక్టర్ డాక్టర్ దుర్గేష్, చిన్నపిల్లల వైద్య నిపుణులు రవికుమార్, ప్రభుత్వ గైనకాలజిస్ట్ ఇందిరా ప్రియదర్శిని, రెడ్ సంస్థ ప్రతినిధి అనిత, పెథాలజీ ప్రొఫెసర్ పూర్ణచంద్రశేఖర్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జయలక్ష్మి, నాగ శశిభూషణ్ రెడ్డి, విష్ణుమూర్తి, సురేందర్ రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి ఈ. నాగరాజు, డిపిహెచ్ఎన్ఓ ప్రమీల దేవి, లీగల్ కన్సల్టెంట్ సంధ్యారాణి డిప్యూటీ మాస్ మీడియా అధికారి లక్ష్మీనారాయణ, స్టాటిస్టికల్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఆరోగ్య విద్యాధికారి గంగాధర్, డెమో సిబ్బంది వేణుగోపాల్, ఆషా రాణి, , వెంకటేశ్వరరావు,కిరణ్, , శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

AP 4PG 8 - 3- 2026 SUNDAY qxp_Layout 1 08-03-2026 07:03 AM Page 2



## ద్విచక్ర వాహనాల తనిఖీలు



యాడికి, మార్చి 7 (అనంత ప్రభ)

యాడికి మండలం వేములపాడు రోడ్డులో శనివారం యాడికి సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు ద్విచక్ర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.న్నారు మిగతా వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు

## కేజీబీవీల్లో 6వ తరగతి ప్రవేశాలకు ఈ నెల 12 నుంచి దరఖాస్తులు

యాడికి, మార్చి 7 (అనంత ప్రభ)

ఆంధ్రప్రదేశ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ)లో 2026, 27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాలకు మార్గదర్శకాలు విడుదలయ్యాయి. అర్హత కలిగిన బాలికల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అధికారుల వివరాల ప్రకారం, ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 12 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 1 వరకు కొనసాగుతుంది. ఎంపికైన విద్యార్థినుల జాబితాను ఏప్రిల్ 13న ప్రకటించనున్నారు. ప్రతి కేజీబీవీ పాఠశాలలో 6వ తరగతిలో మొత్తం 40 సీట్లు అందుబాటులో ఉంటాయి.

ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలికలు ప్రవేశాలకు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు లోపు ఉండాలి. రిజర్వేషన్ ప్రకారం ఓసీలకు 15 సీట్లు, ఎస్సీలకు 5 సీట్లు, బీసీలకు 10 సీట్లు కేటాయించగా, మిగతా సీట్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం భర్తీ చేస్తారు. అలాగే బడి బయట ఉన్న బాలికలు, అనాథలు, కనీసం 40 శాతం వికలాంగత కలిగిన దివ్యాంగ బాలికలకు ప్రవేశాల్లో ప్రాధాన్యత ఇస్తారు. అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉచిత నివాసంతో కూడిన నాణ్యమైన విద్యను పొందాలని విద్యాశాఖ అధికారులు సూచించారు

## విషాదకర ఘటన... ఇంటి పై నుంచి జారి పడడంతో యువకుడు మృతి...



ఉరవకొండ, మార్చి 7 (అనంత ప్రభ)

విషాదకర ఘటన... ఇంటి పై నుంచి జారి పడడంతో యువకుడు మృతి... ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలో చోటు చేసుకున్న ఈ దుర్ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది...

వివరాల్లోకి వెళ్తే... ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన బేల్దారి సలీం (29) శనివారం ఇంటి రెండో అంతస్తు పైకప్పు నుంచి అనుకోకుండా జారి కిందపడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే సలీం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మృతుడికి భార్య యాస్మికతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. పెద్ద కూతురు సనా, చిన్న కూతురు సానియా తండ్రి మృతితో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కుటుంబానికి ఆధారంగా ఉన్న సలీం ఆకస్మిక మృతి గ్రామస్తులను కలచివేసింది.

సలీం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సలీం ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు

## ఉరవకొండలో బీజేపీ ప్రశిక్షణ కార్యశాలపై సమావేశం



ఉరవకొండ, మార్చి 7 (అనంత ప్రభ)

ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుల సూచన మేరకు జిల్లా స్థాయి ప్రశిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఉరవకొండ నియోజకవర్గం ఉరవకొండ మండలానికి సంబంధించిన ప్రశిక్షణ కార్యశాల నిర్వహణపై శనివారం చర్చ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఈనెల 23వ తేదీన మండల స్థాయిలో ప్రశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని మండల అధ్యక్షులు నిర్ణయించారు. పార్టీ బలోపేతం, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

ఈ సమావేశంలో ప్రశిక్షణ కార్యశాల అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొలిమి రామాంజనేయులు, మండల అధ్యక్షులు ధనుంజయ ఆచారి, మార్కెట్ డైరెక్టర్ రామాంజనేయులు, ప్రశిక్షణ మండల కో-కన్వీనర్ సి. వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నాయకులు

## రాయలచెరువులో రైతులకు మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన




యాడికి, మార్చి 7 (అనంత ప్రభ)

యాడికి మండలం రాయలచెరువు రైతు సేవా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులకు మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి ఉమాదేవి పాల్గొని రైతులకు మైక్రో ఇరిగేషన్ పద్ధతులు, ఆధునిక సాంకేతికత వినియోగంపై వివరించారు. రాయలచెరువు గ్రామంలో నిర్వహించిన ఆటోమేషన్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఫోన్ ద్వారా నీటి పారుదల వ్యవస్థను నియంత్రించే విధానాన్ని రైతులకు ప్రదర్శించారు. మొబైల్‌లో సమయాన్ని సెట్ చేసుకోవడం ద్వారా పొలాల్లో ఏర్పాటు చేసిన గేట్ వాల్వ్‌ను ఆటోమేటిక్‌గా ఆన్, ఆఫ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా నీటి వినియోగం తగ్గి, సమయం మరియు శ్రమ ఆదా అవుతుందని చెప్పారు. రైతులు ఆధునిక పద్ధతులను వినియోగించుకొని పంటల దిగుబడిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## 9న జరిగే ధర్నా విజయవంతం చేయండి



ఉరవకొండ, మార్చి 7 (అనంత ప్రభ)

ఉరవకొండ పట్టణంలో ఈనెల 9వ తేదీన తాసిల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా ను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వై, విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్ డి టి స్వచ్ఛంద సంస్థకు ఎఫ్ సి ఆర్ ఏ నిధులు విషయంపై ధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. ధర్నాకు అఖిలపక్షాలు ప్రజా విద్యార్థుల సంఘాలతో కలిసి ధర్నా ఉంటుందన్నారు. కాంగ్రెస్, అన్ని కుల సంఘాలు మద్దతునిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కుల సంఘాలు నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు,

ఉరవకొండ, మార్చి 7: (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యులు శ్రీ వై. విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉరవకొండ పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజల అభివృద్ధికి ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఆర్‌డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ (ఖీజ=ూ) అనుమతిని కేంద్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "సేవ్ ఆర్‌డీటీ" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు ఉరవకొండ ఎమ్మార్వో కార్యాలయం వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉరవకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ఆర్‌డీటీ ద్వారా లబ్ధి పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలు, బహుజనులు, యువత, విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు మరియు ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఆర్‌డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతిని వెంటనే రీన్యువల్ చేయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఇది జరగని పక్షంలో భవిష్యత్తులో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లను ముట్టడించే కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఉద్యమాన్ని శాంతియుతంగా కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బసవరాజ్, ప్రసాద్, తిప్పయ్య, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సాకే పురుషోత్తం, కాంగ్రెస్ పార్టీ నాయకులు శీనా, అబ్బాస్, డీజీహెచ్ఎస్ గోపాల్, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్,ూ×ఖీఱూ జిల్లా అధ్యక్షుడు నందు తరుణ్, జిల్లా నాయకులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఎర్రితాత రథోత్సవం -- డ్రోన్ చిత్రీకరణలో అద్భుత దృశ్యాలు



ఉరవకొండ, మార్చి 7 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని వై. రామాపురం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ ఎర్రితాత స్వామి రథోత్సవం ఈరోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

ఈ సందర్భంగా ఎర్రితాత స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో దేవాలయం నూతన శోభను సంతరించుకుంది. రాత్రి వేళల్లో దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం మరింత అందంగా కనిపించింది.

రథోత్సవాన్ని తిలకించేందుకు అనంతపురం జిల్లా నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రం కర్ణాటక ప్రాంతం నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులు స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. మంగళ వాయిద్యాల నడుమ భక్తి పారవశ్యంతో స్వామివారి రథాన్ని గ్రామ వీధుల గుండా భక్తులు లాగుతూ ఊరేగించారు.

ఈ వేడుకలను ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించగా, పై నుంచి కనిపించిన రథోత్సవం దృశ్యాలు భక్తుల రద్దీతో అద్భుతంగా కనిపించాయి. ఆలయం చుట్టూ భక్తులతో నిండిన ప్రాంగణం, దీపాల అలంకరణ, రథోత్సవం ఊరేగింపు డ్రోన్ చిత్రాల్లో మరింత ఆకర్షణీయంగా దర్శనమిచ్చాయి.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజన్న గౌడ్, సర్పంచ్ ఎల్లప్ప, రేణుకమ్మ, ఎర్రి స్వామి, శివశంకర్,ూ. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా ఎర్రితాత స్వామి రథోత్సవం... భక్తుల రద్దీతో కిక్కిరిసిన వై. రామాపురం గ్రామం... విద్యుత్ దీపాలంకరణలో కొత్త శోభను సంతరించుకున్న ఎర్రితాత ఆలయం... డ్రోన్ కెమెరాలో అద్భుతంగా దర్శనమిచ్చిన రథోత్సవ దృశ్యాలు...

ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని వై. రామాపురం గ్రామంలో వెలసిన శ్రీ ఎర్రితాత స్వామి రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతపురం జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి రథాన్ని భక్తులు గ్రామ వీధుల గుండా లాగుతూ భక్తి పారవశ్యంలో పాల్గొన్నారు. ఈ రథోత్సవ వేడుకలను డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించగా పై నుంచి కనిపించిన దృశ్యాలు ఎంతో అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## డ్రైనేజీ పనులకు అడ్డుగా ఉన్న కరెంట్ స్థంభం తొలగింపు -- విద్యుత్ అధికారులు, మీడియా మిత్రులకు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ కృతజ్ఞతలు



ఆదోని, మార్చి 7 (అనంత ప్రభ)

ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు అమరావతి నగర్ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు అడ్డుగా ఉన్న కరెంట్ స్థంభాన్ని విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. దీంతో నెల రోజులుగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి.

అమరావతి నగర్ కాలనీలో నూతనంగా నిర్మాణం చేపట్టిన డ్రైనేజీ మధ్యలో కరెంట్ పోల్ ఉండటంతో పనులు ముందుకు సాగకుండా నిలిచిపోయాయి. ఈ సమస్యను 35వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే ఈ విషయాన్ని ప్రింట్ మీడియా ద్వారా బహిరంగపరచడంతో అధికారులు వెంటనే స్పందించి కరెంట్ స్థంభాన్ని మరో ప్రదేశానికి మార్చించారు.

ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించి డ్రైనేజీ పనులు మళ్లీ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులకు, సమస్యను ప్రజల దృష్టికి తీసుకువచ్చిన మీడియా మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ తెలిపారు.

కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం మరిన్ని పనులు చేపట్టేందుకు కృషి కొనసాగిస్తామని ఆమె పేర్కొన్నారు.

## ప్రెస్ క్లబ్ కు నీటి కుండల వితరణ



అనంతపురం, మార్చి 7 (అనంత ప్రభ)

అనంతపురం ఈరోజు ప్రెస్ క్లబ్ నందు వేసవి తాపం ప్రారంభం కావడంతో ప్రెస్ క్లబ్ కు వచ్చే విలేకరుల దాహార్తి తీర్చడానికి మహబూబ్ బాషా ముందుకు వచ్చారు. కొనకొండ్ల జిల్లా పరిషత్ హై స్కూల్ క్లర్క్ మహబూబ్ బాషా ఐదు నీటి కుండలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేకరులు సందనం రవికుమార్, జిలాన్, బన్సీలాల్ నాయక్, రవికుమార్, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కూడేరు, మార్చి 7 (అనంత ప్రభ)

కుడేరు మండల కేంద్రంలోని మండల విద్యా కార్యాలయంలో మండల ఎం ఈవో మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యం ఆర్ సి లో పని చేస్తున్న యం ఐయస్ కో ఆర్డినేటర్ అదంభి మరియు సి ఆర్ పి ఆదిలక్ష్మి లకు శాలివాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యంఇఒ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సమానత్వం, సౌభ్రాతృత్వం కల్పించాలని కొనియాడారు. మరియు మహిళలు 100% అక్షరాస్యత సాధించాలి అని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సమాన హక్కులు కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వైయస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. ఓబుళపతి, ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు రామ్ భూపాల్ రెడ్డి, ఆదిలక్ష్మీ, వసంత, యంఆర్ సి సిబ్బంది. ఆంజనేయులు, రమణ, కుంటేన్న తదితరులు పాల్గొన్నారు


## కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాల 2026 - 27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు



శింగనమల, మార్చి 7 (అనంత ప్రభ)

మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాల 2026 - 27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ గీతారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరో తరగతి ఇంట ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుచేసుకోవచ్చని ఏడు, ఎనిమిది, తొమ్మిది ,పదోతరగతితోపాటు ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో ఖాళీ సీట్లు ూ గూడా అడ్మిషన్లు చేపట్టమన్నారు మొదట బడి బయట పిల్లలు డ్రాప్ అవుట్స్,తర్వాత అనాథలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సీటు కేటాఇస్తామని విద్యార్థులు ఈనెల 12 నుంచి ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు ఏప్రిల్ 13 నుంచి 17వ తేదీ వరకు ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తామన్నారు మిగతా వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు

## కడితోటలో ముమ్మర వాహన తనిఖీలు



ఆదోని, మార్చి 7 (అనంత ప్రభ)

ఆదోని మండలం కడితోట గ్రామంలో పోలీసుల వాహన తనిఖీలు నిర్వహించారు. శనివారం కడితోట గ్రామ బస్టాండ్ సమీపంలో ఆదోని రూరల్ సీఐ నల్లప్ప ఆధ్వర్యంలో ఎస్సై విద్యశ్రీతో పాటు పోలీస్ సిబ్బంది వాహనాలపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్, కాలుష్య సర్టిఫికెట్ తదితర పత్రాలను పరిశీలించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉరవకొండలో అగ్నిప్రమాదాల బీభత్సం... దానిమ్మ, బత్తాయి తోటలు దగ్ధం -- రూ.25 లక్షల నష్టం

ఉరవకొండ, మార్చి 7 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన అగ్నిప్రమాదాల్లో దానిమ్మ, బత్తాయి తోటలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనల వల్ల రైతులకు సుమారు రూ.25 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు. పంటలు పూర్తిగా కాలిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉరవకొండ మండలం మైలారంపల్లి గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు ప్రకాష్‌కు చెందిన సుమారు 2 ఎకరాల చీని (బత్తాయి) తోట మంటల్లో కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిరిన నిప్పురవ్వల కారణంగా మంటలు వ్యాపించినట్లు స్థానికులు తెలిపారు. వేగంగా వ్యాపించిన మంటలతో తోటలోని చెట్లు, డ్రిప్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల మేర నష్టం జరిగినట్లు రైతు ప్రకాష్ తెలిపాడు. ఎంతో కష్టపడి పెంచుకున్న తోట ఒక్కసారిగా కాలిపోవడంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదనలో మునిగిపోయింది.



ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతు కోరాడు.

ఇదిలా ఉండగా, ఉరవకొండ నియోజకవర్గంలోని ఆరుకొట్టాల గ్రామానికి చెందిన రైతు విజయ్‌కుమార్‌కు చెందిన సుమారు 2 ఎకరాల దానిమ్మ తోట కూడా అగ్నిప్రమాదానికి గురైంది. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో తోటలోని దానిమ్మ చెట్లు, డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.15 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు రైతు విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు.

అయితే ఈ అగ్నిప్రమాదం వెనుక ఎవరో కావాలని నిప్పు పెట్టి ఉండవచ్చని రైతు విజయ్‌కుమార్ అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు. పంటలు నాశనం కావడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని ఉరవకొండ నియోజకవర్గంలోని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా కాలం చెల్లిన విద్యుత్ తీగలను వెంటనే తొలగించి కొత్త వైర్లు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వివిధ సబ్‌స్టేషన్ల నుంచి వెళ్లే 11 కె.వి విద్యుత్ తీగలు తరచుగా తెగిపడి పంట పొలాల్లో పడుతున్నాయని, దీంతో పంటలు నాశనం అవడంతో పాటు రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతోందని వారు వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరమైన పాత కరెంట్ లైన్లను మార్చాలని రైతులు కోరుతున్నారు

# అర్హతకు దేవరింటికి దక్కిన గుర్తింపు సీనియర్ జర్నలిస్ట్ బాలచంద్ర నాయుడుకు స్టేట్ అక్రిడిటేషన్

ఉరవకొండ, మార్చి 7 (అనంత ప్రభ)

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుదీర్ఘకాలంగా జర్నలిజం రంగంలో సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ డి. బాలచంద్ర నాయుడుకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన సుదీర్ఘ అనుభవం, వృత్తి పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆయనకు స్టేట్ అక్రిడిటేషన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

35 ఏళ్ల సుదీర్ఘ జర్నలిజం ప్రస్థానం

1990 సంవత్సరం నుంచి నేటి వరకు (2026) దాదాపు 35 సంవత్సరాలుగా బాలచంద్ర నాయుడు జర్నలిజం రంగంలో కొనసాగుతున్నారు. ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ క్షేత్రస్థాయి రిపోర్టింగ్‌లో తనదైన ముద్ర వేశారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర విశేషమని సహచరులు పేర్కొంటున్నారు.

పనిచేసిన ప్రముఖ పత్రికలు

బాలచంద్ర నాయుడు తన జర్నలిజం జీవితంలో పలు ప్రముఖ దినపత్రికల్లో పనిచేశారు.

ఉదయం (కనేకల్, ఉరవకొండ), వార్త (కనేకల్, ఉరవకొండ), ప్రజాశక్తి, ఆంధ్రజ్యోతి (బళ్లారి సిటీ, ఉరవకొండ), సూర్య దినపత్రిక, ఆంధ్రప్రభ,

జ్యోతి దినపత్రిక, సేవలకు గుర్తింపుగా స్టేట్ అక్రిడిటేషన్



ఇప్పటివరకు ఆయన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఎనిమిది సార్లు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసింది. ఆయన సీనియారిటీ, అనుభవాన్ని ప్రామాణికంగా తీసుకున్న విజయవాడలోని రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయం తాజాగా రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ మంజూరు చేసింది.

ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ బాలచంద్ర నాయుడును పలువురు జర్నలిస్ట్ మిత్రులు, రిపోర్టర్ బాలరాజు, మాజీ ప్రధానోపాధ్యాయులు మాలపాటి శ్రీనివాసులు, పలువురు రాజకీయ ప్రముఖులు అభినందించారు.

పత్రికా రంగంలో ఆయన మరింత సేవలు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు

# మొళగవల్లి కొట్టాల్లో 'మంటలు'.. అధికారుల్లో 'మౌనం'

ఆలూరు, మార్చి 7 (అనంత ప్రభ)

ఆలూరు మండలంలోని మొళగవల్లి కొట్టాల గ్రామంలో దళిత రైతు గడ్డివాము అగ్నికి ఆహుతై మూడు రోజులు గడిచినా అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో సుమారు లక్ష రూపాయలకు పైగా విలువైన పశువుల మేత పూర్తిగా దగ్ధమైంది. బాధిత రైతు జయన్నను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ సమాచార హక్కు చట్టం విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టాల రాజు డిమాండ్ చేశారు.

గ్రామానికి చెందిన రైతు జయన్న తన పశువుల కోసం గత ఏడాది రూ.50 వేల విలువైన వరిగడ్డిని, ఈ ఏడాది మరో రూ.50 వేల విలువైన వరిగడ్డితో పాటు రూ.30 వేల విలువైన జొన్న సొప్పును కొనుగోలు చేసి గడ్డివాముగా నిల్వ చేసుకున్నాడు. అయితే చెత్త సేకరణ కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులు



సేకరించిన బూడిదలోని నిప్పురవ్వలు గాలికి ఎగిరి గడ్డివాముపై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో సుమారు లక్ష రూపాయలకు పైగా విలువైన పశువుల మేత బూడిదైంది.

గ్రామస్థులు సమయస్ఫూర్తితో స్పందించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పడంతో పక్కనే ఉన్న మరో నాలుగు గడ్డివాములు ప్రమాదం నుంచి తప్పించబడ్డాయి.

అయితే ప్రమాదం జరిగి మూడు రోజులు గడిచినా బాధిత రైతును పరామర్శించేందుకు ఒక్క రెవెన్యూ అధికారి కూడా సంఘటన స్థలానికి రాకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీఆర్వో, ఆర్‌ఐ, ఎమ్మార్వో స్థాయి అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం దారుణమని వారు విమర్శించారు. దళిత రైతు కావడం వల్లే వివక్ష చూపుతున్నారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ విషయంపై స్పందించిన వైఎస్సార్‌సీపీ సమాచార హక్కు చట్టం విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టాల రాజు ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించి బాధిత రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు

# ఆదోనిలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు -- ఆది కృష్ణమ్మ క్యాంప్ కార్యాలయంలో కేక్ కటింగ్

ఆదోని, మార్చి 7 (అనంత ప్రభ)

ఆదోని పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే ఆర్పి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షురాలు గుడిసే ఆది కృష్ణమ్మ నివాసం (క్యాంప్ కార్యాలయం) వద్ద మహిళలు కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన వారు మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను నిలబెట్టేది మహిళలే అని, ప్రతి రంగంలోనూ తమ ప్రతిభతో మహిళలు ముందుకు సాగుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు.

"మహిళ అంటే శక్తి...
మహిళ అంటే సాహసం...
మహిళ అంటే సృష్టి..."

అనే భావనను ప్రతిబింబిస్తూ మహిళల పాత్ర సమాజ అభివృద్ధిలో ఎంతో గొప్పదని పేర్కొన్నారు. కుటుంబానికి ధైర్యం, సమాజానికి దారిదీపం, దేశానికి బలంగా నిలిచే ప్రతి మహిళకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.



అంతేకాక మహిళల గౌరవం, భద్రత, సమాన హక్కులు కలిగిన సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు విద్య, ఉపాధి, రాజకీయాలు, వ్యాపారం వంటి ప్రతి రంగంలోనూ ముందుకు సాగి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆదోని పట్టణానికి చెందిన పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు







# ఈ 5 ఆసనాలతో మీ లివర్ సేఫ్..

లివర్ ఫెయిల్ అయితే, మన బాడీలో చాలా పనులు జరగవు. ఫ్యాటీ లివర్స్, లివర్ ఫైబ్రోసిస్, హెపటైటిస్, లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్ వంటి సమస్యల నుండి కూడా రక్షించడం కూడా చాలా ముఖ్యం. దీనికి మంచి ఫుడ్ తీసుకోవడం, హైడ్రేటెడ్‌గా ఉండం, మంచి నిద్రతో పాటు యోగాసనాలు కూడా హెల్ప్ చేస్తాయి. అవేంటంటే..

బాలాసన..

బాలాసనం.. ఇది చేయడం వల్ల వల్ల లివర్‌కి హెల్ప్ అవుతుంది. ఎలా చేయాలంటే...

ముందుగా మీ వెన్నెముకని స్ట్రెయిట్‌గా పెట్టి మోకాళ్ళపై కూర్చోవాలి. రెండు తొడలు ఛాతీకి తగిలేలా నెమ్మదిగా శర్శీరన్ని ముందుకు వంచాలి. తల మోకాళ్ళని దాటి నేల తాకే వరకూ ముందుకు వంగండి.
తర్వాత రెండు చేతులను కాళ్ళకు ఇరువైపులా నిటారుగా చేసి నేల వైపు చూడండి.
20 నుంచి 25 సెకన్ల పాటు ఈ పొజిషన్‌లో ఉండండి. తర్వాత సాధారణ స్థితికి రావాలి. కొన్ని సెకన్ల తర్వాత మళ్ళీ ఇలానే చేయండి. ఇలా రోజుకి 5 సార్లు చేయండి.

అనులోమ, విలోమ ప్రాణాయామం..

ప్రాణాయమం కూడా చాలా హెల్ప్ చేస్తుంది. ఇందులో ముఖ్యంగా అనులోమ్, విలోమ ప్రాణాయామం చేయాలి. ఇందులో ముక్కుని ఓ వైపు మూసి శ్వాసన పీల్చి, కాసేపు పట్టుకుని మరో వైపు కూడా ఇలా చేయండి. ఎలా చేయాలంటే..

ముందుగా పద్మాసనంలో కూర్చోండి.
రెండు చేతులను మోకాళ్ళపై ఉంచండి. కుడి బొటన వేలితో కుడి ముక్కు రంధ్రాన్ని గట్టిగా పట్టుకుని ఎడమ ముక్కు రంధ్రం ద్వారా గాలి పీల్చాలి.
5 నుంచి 10 సెకన్ల పాటు ఇలా శ్వాసను పీల్చండి. తర్వాత బొటనవేలుని కుడి నాసికా రంధ్రానికి పైన వదలండి. దాని ద్వారే శ్వాస వదలండి. తర్వాత ఎడమ ముక్కు రంధ్రాన్ని మధ్య వేలితో గట్టిగా మూయాలి.
10 నుంచి 15 సెకన్ల పాటు ఇలానే చేయండి.

ధనురాసనం..

ధనురాసనం.. వంగిన విల్లు లాంటి ఈ పోశ్చర్ లివర్‌కి చాలా మంచిది. మీ కడుపు నేలను తాకేలా నేలపై పడుకోండి. కాళ్ళని కొద్దిగా దూరంగా పెట్టి చేతులు శరీరం వైపులా ఉంచండి.

మీ చేతలతో పాదాలను పట్టుకుని సున్నితంగా పట్టుకోండి. ఇప్పుడు గాఢంగా పీల్చి ఛాతీ, కాళ్ళని పైకి ఎత్తండి.
మీరు ఎంతసేపు వీలైతే అంతవరకు ఇలానే ఉండండి.
తర్వాత మెల్లిగా సాధారణ స్థితికి రండి. ఈ ఆసనంతో ఊపిరితిత్తులు, కాలేయానికి చాలా మంచిది. కాలేయ పనితీరు కూడా పెరుగుతుంది.

అథోముఖ స్వనాశన..

ముందుగా నిలబడాలి.
ఆ తర్వాత మెల్లిగా చేతలని వంచుతూ మీ శరీరాన్ని త్రిభుజాకారంలో ఉండేలా చూసుకోండి.
ఇప్పుడు నెమ్మదిగా తలని పైకి ఎత్తండి. మోకాళ్ళని కొద్దిగా వంచి కాళ్ళని బయటికి చాచాలి.
శ్వాస తీసుకుంటూ వదలండి.

నవాసన..

ముందుగా చాప మీద నేరుగా పడుకోండి. రెండు చేతులని పక్కకి ఆనించి పెట్టండి. దీర్ఘంగా శ్వాసని పీలుస్తూ వదలండి. ఒకేసారి కాళ్ళు, శరీర భాగాన్ని నడుముపైకి ఎత్తండి.
పెల్విస్ మాత్రమే నేలపై ఉండేలా చూసుకోండి.
తర్వాత నెమ్మదిగా రెండు చేతులని పైకెత్తి మోకాళ్ళ మధ్య నిటారుగా ఉండాలి.
దీనిని చేయడం వల్ల శరీరంలోని కండరాలన్నీ ఫ్లెక్సీబుల్‌గా మారి. కడుపు ప్రాంతంలో ఫోకస్ చేయడం వల్ల లివర్‌కిచాలా మంచిది. ఈ పొజిషన్‌లో 5 నిమిషాలు ఉండాలి.



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్ధ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.


అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యురిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిసున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్ల 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికీ.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యురిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com